స్కెచ్

# చిగురించిన ఆశాజ్యోతి

“శ్వారాణి”

కదులుతున్న ఆ కంపార్టుమెంటులో యింకా చాల మంది కూర్చున్నారు. ఆ కదలని కళ్ళలో అతను ఒక్కడే మెదులుతున్నాడు. అంత మందిలో ఎవరి వంకా చూడకుండా, తన వైపే అదే పనిగా ఎందుకు చూడాలి? ఆపదలో వున్నప్పుడు ఆత్మీయులు దగ్గరగా వచ్చి బుజ్జగించినట్లు ఆ చూపులు అతన్ని లాలిస్తుంటే అతని ఆత్మలో ఆశా విశ్వాసాల స్రోతస్సు ప్రవహించింది. అయినా, అతనికెందుకో భయమేసింది! ఆమె ఎవరో తనకు తెలియదు. తనెవరో ఆమెకు తెలియదు. తెలియని రెండు బంధాలకు సంబంధాలను ఏర్పరచి. అనుబంధాన్ని అందించాలని ఆమె కన్నులు ఎందుకు ఆశిస్తున్నాయో. ఎంత ఆలోచించినా అతనికా అంతు చిక్కలేదు. తన జీవిత చరిత్రలో బహుశా ఆ చూపుల దండాన్వయం, అపూర్వ అధ్యాయంగా చిత్రించబడితే, అది నిజమవుతుందా అన్న సందేహం అతన్ని కలవర పెట్టింది. ఇంతకు ముందెన్నడు కోరుకున్నా, ప్రయత్నించినా అటువంటి అనుభూతి సంభవించలేదు. ఒక వేళ జరిగినా అది మధురానుభూతిగా మారలేదు. అపశృతి మాత్రం మేళవించింది.

గుంటూరు స్టేషను వచ్చేసరికి బండిలో చాల వరకు ఖాళీ అయింది. వాళ్ళతో బాటు ఆమె కూడా అచ్చట దిగిపోతే బావుండుననిపించింది.

ఆమె అచ్చట దిగలేదు. పైగా నవ్వుతోంది. అతని మనస్సులో ఉద్దేశ్యం తేలిగ్గా గ్రహించిందనుకుంటా, అందుకే నవ్వింది. బెజవాడ దాటి వెళ్తుందేమో! ఆమె ఎక్కడికి వెళ్తే తనకెందుకు? ఆ చూపుల్లో భావాన్ని అర్థం చేసుకోవడం అవసరమేమో? ఆ అవసరాన్ని కాంక్షించడం అతనికిష్టంలేదు. ఆ పెట్టె నుంచి దిగి వెళ్ళిపోవాలనిపించింది. ఆ చూపులు తిరిగి జ్ఞాపకానికి వస్తాయి. పరిత్యజించిన కోర్కెలు మళ్ళీ వాంఛించాలని బుద్ధి పుడుతుంది. సాహసించి, తనేదో సాధించాలని సంకల్పించుకున్నప్పుడు, ఆమె చూపుల్లో అంతర్యాన్ని తాను గమ్యానికి చేరుకునే లోగా తెలుసుకోవాలని విశ్చయించుకొని, అచ్చటే కూర్చుండిపోయాడు,

మరి కొంత మంది ప్రయాణీకుల్ని భరించి, బండీ కదిలింది. నీలాల లాగ తళతళ మెరసే కళ్ళు, మిల మిల నవ్వుతూ, “ఎందుకు తప్పించుకు తిరుగుతారు.” నమక్షంలో సానుభూతి వాక్యాలు పలుక్కుతున్నాయి. తనకు ఆ కళ్ళను చూచే అర్హతాలేదు, ఆ కళ్ళలో సౌందర్యాన్ని ఆస్వాదించే అకారమూలేదు.

అందరి లాగ తను విశాల ప్రపంచంలో ఒక మానవుడే అందరు కోరుకున్నట్లే, తను ఆశలను పరచుకొని. కోర్కెలను తెరచుకొని, వాటి కార్యనిర్వాహణకోసం వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాడు.

ఆశలు అడియాశలయ్యాయి.

కోర్కెలు కన్నీటితో కరిగిపోయాయి. సమాజం దృష్టిలో అతడొక భయంకరమైన స్వరూపంగా తయారయ్యేడు. మంచి, నిర్ణయించలేని మానవతలేని సమూహంలో కురూపిలాగ కన్పించాడు.

ఇహ ... కాని .... తను విషాధ పరిదగ్ధ జీవితం మిగిలాయి. భవితవ్యంలో తనకు ఆనందము సంతోషము, వినోదము, వికాసము, భగవంతుడు శేషించలేదని నిర్ధారణకు వచ్చి, చీకటి ముసుగులో నిర్వేదిస్తున్నాడు. వాంఛలను విడిచిపెట్టివేశాడు.

తల్లిదండ్రులు తన వివాహం తలపెట్టినప్పుడు, పెళ్లి కూతుర్ని చూడ్డానికి వెళ్లేముందు అద్దంలో తన మొహాన్ని చూచుకున్నాడు. తన మొహాన్ని తనే చూమకోలేకపోయాడు. భయంతో వొళ్ళంత కంపించిపోయింది. చేతిలో వున్న అద్దం, నేలమీద పడి తునాతునకలయిపోయింది. ఆ పగిలిన ముక్కల దగ్గరకు వచ్చి, వొంగి చూశాడు. ఇంతకు ముందు అద్దంలో ఒక ముఖం, ఇప్పుడు అనేక ముఖాలు! అక్కడ ఒక్క క్షణం నించోలేకపోయాడు.

కాని ఎంత వద్దని వాదించినా, తల్లిదండ్రుల బలవంతం వల్ల. పెళ్ళి కూతుర్ని చూడ్డానికి బయలుదేరాడు. తనకు వివాహం జరిగితే, ఆ అమ్మాయి ఎంతగా కుమిలి

పోతుందో వూహించుకునే లోగా, పెళ్ళి కూతురు అచ్చట నుంచి లేచి వెళ్ళిపోయింది. పెళ్ళి కూతురు తరపు వాళ్ళు, అమ్మాయికి అబ్బాయి నచ్చలేదని చెప్పడం జరిగింది.

మరొక సంబంధం విషయంలో, "ఒకవేళ అతనితో పెళ్ళి జరిగితే ఉరి తీసుకొని చస్తాను" అని పెళ్ళి కూతురు నిద్రహారాలు లేకుండా నాల్గు రోజులు నిరశన వ్రతం పట్టింది!!

గడిచిపోయిన సంధర్బాలు మదిలో మెదిలేసరికి అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అవమానంతో విష్టూరాలతో వివర్ణమై పోయిన అతని ముఖం, ఆమె ఆలోచనలను భావాలను మ్రింగేసి, ఆమె వంక చూడలేక పోయింది. అతని వేదనలను కన్నీటితో కడిగివేయాలనే కాంక్ష ఆమె కళ్ళలో కదులుతోనే వుంది.

"మిమ్మల్ని వేధిస్తున్న బాధ మీ సహృదయం నాకు చెబుతోంది. మీ అంతః సౌందర్యాన్ని అర్థం చేసుకునే అవకాశం భగవంతుడు నాకిచ్చాడు. మీరు అందరి కంటె అందంగా వుంటారు. అందుకు నా కళ్ళే సాక్ష్యం. ఇటు చూడండి." ఏ మాత్రం ఉద్వేగాన్ని గాని చాంచల్యాగాని ప్రకటించ కుండా, ఆ కళ్ళు నిట్టూర్పునెత్తావి దొంతరలతో కబురు పంపుతున్నాయి. ఆమె ప్రయత్నంలో తాత్పర్యం అర్థం కాక, ఆమె పరిహసిస్తుందని, తన వికృతాన్ని మరొక విధంగా గేళిచేస్తుందని అనుకున్నాడు.

"వొద్దు. ఈ సమాజానికి దూరంగా వుండవలసిన నన్ను, మళ్ళా పిలచి అవమాన పరచవద్దు. అందరి ముందు నిలబెట్టి, నా వికృతస్వరూపాన్ని బహిరంగ పరచవద్దు." అతని హృదయాన్ని చీల్చుకొని, వెలువడిందో మూగ ఆక్రందన.

"అంతరాత్మలో దాగి వున్న సత్యాన్ని చూడగల్గుతున్నాను. నా కళ్ళ ముందు మీరొక అద్భుతవ్యక్తులుగా కన్పిస్తున్నారు. మీ మంచితనాన్ని చూడగలిగే అదృష్టం అంత తేలిగ్గా అందరికి లంభించదు." ఆమె కళ్ళతో ఆనందం మెరసింది.

మంగళగిరి స్టేషను వచ్చింది. ఆమె కళ్ళను వొత్తుకొని, కిటికీలోనుంచి కొండ మీద వున్న గోపురాన్ని చూచి నరసింహస్వామికి నమస్కరించింది. అతని వంక తిరిగి, చూసింది.

"స్వామికి మనసార అంజలిచ్చి అర్థించండి. మీ మనస్సులో వున్న దిగులుపోతుంది." హసిస్తున్న ఆమె కళ్ళలో కోర్కెను కాదనలేక, అతడుతన్మయుడై నమస్కరించాడు. కళ్ళు తెరచి చూచేసరికీ, ఆమె చీర చెంగుతో కళ్ళను తుడుచుకుంది. అతని మనస్సు ఆనందంతో స్పందించి, ఉద్రూతలూగింది.

ఆ కళ్ళు మనస్ఫూర్తిగా నవ్వాయి. ఆ కన్నులలో చిరునవ్వు వెన్నెలలు ఈసారి స్పష్టంగా చూడగలిగాడు.

"ఎక్కడికి వెళ్ళినా ఈ కళ్ళు మిమ్మల్ని వెతుక్కుంటూనే వస్తాయి. ఆ సంగతి మరిచిపోదల్చుకుంటే, మిమ్మల్ని వేధిస్తున్న సమస్యకు సమాధానం యిహ వుండదు." ఆ కళ్ళలో యింతకుముందున్న శాంతము, సరళము యిప్పుడు లేవు. తన భయ కంపిత హృదయాన్ని విడిపోని అనుబంధాలతో కట్టి, తనకు మళ్ళా పునర్జన్మ సిద్ధింపజేయడానికి తొందరపడుతున్నాయి.

తాడేపల్లి స్టేషను వచ్చినా, అతడు కదలలేకపోయాడు. బండి కదలి, కృష్ణానది వంతెనమీద మెల్లిగా పరుగెడుతోంది.

కృష్ణవేణి తరగల మెరపు మాటున దాగివున్న సౌందర్యాన్ని, అతని కళ్ళు చూస్తుంటే, ఆమె చిలిపిగా నవ్వింది, కలలుకంటున్న ఆ కళ్ళ వెనక ధర్మనిలయంతో ఆఖరు జీవిత సౌందర్యాన్ని నిర్మించుకున్నాడు. ఆ విశాల నేత్రాంచలాలమీద అతడు ఆశాజ్యోతిని తిరిగి వెలిగించుకున్నాడు.

చీకటిని చీల్చుకొని వెలుగులోనికి వచ్చినట్లు, అతన్ని ఎక్కడికో తారతమ్యాలు, ఎత్తుపల్లాలు, అభిన్న భిన్నత్వాలు లేని దూర దూర తీరాలకు.... దిగంతాల అవతలకు .... ఎవరో తీసుకొనిపోయి.... అమరనాదం విన్పిస్తూ, అమృతాన్ని అందిస్తూ, అతని శరీరాన్ని కళ్ళను, మనస్సును మార్చివేసి కొత్త సౌందర్యాన్ని వికసింపచేసినట్లు.... ఎదో ఒక కల... మరపురాని మధురాతి మధురమైన కల... అతనిముందు. కళ్ళు తెరచి వుండగానే. ఏమిటీ మమత? మమత అని చెప్పుకోటానికి కూడా నోచుకోలేని అతడిప్పుడు, మమతాభూయిష్టమయినా మాయలో చిక్కి, జీవితంలో కొత్త మార్గాల వేపు ప్రయాణం చేస్తున్నాడు.

తన ఆలోచనలను చెల్లా చెదరు చేస్తూ, తన ఊహలను పూడ్చివేస్తూ, బెజవాడ స్టేషనులో బండి వచ్చి

ఆగింది. అతను అక్కడ దిగిపోవాలి. ఆమె ఎక్కడికి వెళ్తుందో తనకు తెలియదు. బండి దిగి ప్లాటు ఫారము మీదకు వచ్చి నిలబడ్డాడు.

ఆమె తర్వాత దిగి, గుమ్మానికి యివతల నిలబడి అతని వంక హృదయపూర్వకంగా దృష్టి మరల్చింది.

"నన్ను మళ్ళా మానవుల్నిగా చేశారు. ఆశలను అడుగడుగునా చంపుకొని, నిరాశలతో నికృష్టంగా బ్రతుకుతున్న చీకటి జీవితానికి వెలుగు చూపించారు. మీ ఋణాన్ని ఈ జన్మలో తీర్చుకోలేను. పునర్జన్మవుంటే నా ఆశ అడియాసకాదు." అతని కళ్ళు కృతజ్ఞత తెలుపుతూ అభినందించాయి.

"రాజమండ్రి వెళ్ళేబండి సిద్ధంగా వుందట. త్వరగా బయలుదేరు." ఆమె తల్లి బండిలో నుంచి దిగి సామాన్లు కూలీలకు పురమాయించి, కూతుర్ని వెంటపెట్టుకొని బయలుదేరింది.

ఆమె చేతిలో వున్న రుమాలు, క్రిందకు జారిపడితే— ఆమె వెనక్కు తిరిగి కడసారిగా అతని కళ్ళలోనికి చూచింది. చేతి రుమాలు తీసుకొని ఆమె కన్పించే వరకు చూచి ప్లాట్‌ఫారం నుంచి కదిలాడు.

మళ్ళీ జీవితంలో ఆమెను కలుసుకోగల్గితే యీ ఋణానుబంధం. ఏ విధంగా సన్నిహిత మవుతుందో యిప్పట్నుంచే ఊహించుకుంటూ, కాలిబాట మీద నడిచి వెళ్ళిపోయాడు........ ★

విలియం సారోన్‌య రచించిన "నీతికథ"

# అసంతృప్తికి అంతెక్కడ?

ఆ యింట్లో ఒక పుట్టు గుడ్డివాడు వుండేవాడు. పాపం! గుడ్డివాడు అని యింట్లో అందరూ వాణ్ణి ఎంతో ఆదరాభిమానాలతో చూసేవారు. అయినాకూడా తనని ఎవరూ సరిగా చూడ్డంలేదనీ, గుడ్డివాడుకదా అని లోకువ చేస్తున్నారనీ అతడు వాపోయేవాడు. ఇంట్లోవారు ఏమి చేసినా వాడికి తృప్తి కల్గేదికాదు. అంతా నీరు తాగితే వాడికి పాలుయిచ్చి, అంతా మజ్జిగ పోసుకుంటే వాడికి పెరుగుపోసి, అంతా ఒక ముద్దే తింటే వాడికి కడుపునిండా పెట్టినాకూడా నన్ను సరిగ్గా చూడ్డంలేదని గొణిగేవాడు. ప్రాణం విసిగి ఒకనాడు ఎంత తింటాడో చూద్దామని మేకని పూర్తిగావండి పెట్టారు. రుచిగా వండిన మేక మాంసాన్ని వాసన చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు గుడ్డివాడు. అది చూసి యింటి వాళ్ళు హమ్మయ్య అనుకొనే సమయంలో గుడ్డివాడి ముఖకవళికలు మారాయి. ఓ క్షణంపాటు ఆలోచించి గుడ్డివాడు అన్నాడు : "నా భాగానికే యింత మాంసంవస్తే మీరు ఎంతెంత తిన్నారో !"